

భవన నిర్మాణ పనుల్లో కూలీలు

పోరాటం ఆగదు



ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే అధికారులు అనేక నిబంధనలు చూపుతుంటారు. మా కార్మికులకు లేబర్ వెల్ఫేర్ బోర్డు ద్వారా అందించే లేబర్ కార్డు ప్రామాణికంగా బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అందించాలి. అపుడే కార్మికులకు న్యాయం జరుగుతుంది. లేబర్ వెల్ఫేర్ బోర్డుద్వారానే సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని ఇప్పటికే అధికారులకు పలుమార్లు విన్నవించాం. కార్మికశాఖ కార్యాలయం వద్ద ధర్నాలు చేశాం. అయినా అధికారుల్లో ఎలాంటి స్పందన కనిపించ లేదు. పథకాలను పునరుద్ధరించే వరకూ మా పోరాటాన్ని ఆపం.

- వెంకటనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

పథకాలను పునరుద్ధరించాలి..



గతంలో టీడీపీ పాలనలో లేబర్ వెల్ఫేర్ బోర్డుద్వారా మాకు అందే సంక్షేమ పథకాల వల్ల ప్రయోజనముండేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక మా పథకాలకు కోత విధించి కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలకే పరిమితం చేయడం దుర్మార్గం. కష్టం, ప్రమాదంతో కూడుకున్న పనులు మావి. మాలాంటివారికి అన్యాయం చేయడం తగదు. రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టనుంది. ఇకనుంచైనా మా కార్మికులకు అందే పథకాలను పునరుద్ధరించి ఆదుకుంటారని ఆశిస్తున్నాం.

- భాస్కర్, తాపీమేస్త్రీ

పనులు లేక
పలువురి ఇబ్బందులు
పథకాల రద్దుతో
పస్తులున్న కార్మికులు
ధరల పెరుగుదలతో
ఉపాధి
కోల్పోయిన వైనం
లేబర్ కార్డులున్నా
ప్రయోజనం సున్నా
కొత్త ప్రభుత్వంలో
పథకాల
పునరుద్ధరణపై
కోటి ఆశలు



కకావికలం!

వైసీపీ పాలనలో నిర్మాణరంగం కుదేలు



అనంతపురం కల్చరల్, జూన్ 13: రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరనుండటంతో తమకు మంచి రోజులు వస్తాయని భవన నిర్మాణ కార్మికులు ఎదురు చూస్తున్నారు. గతంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక అంతకు ముందు ప్రభుత్వాలు కార్మికుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు స్వస్తి పలికింది. కార్మికుల పొట్ట కొడుతూ కార్మిక సంక్షేమ శాఖ నిధులను సైతం ఇతర పథకాలకు మళ్లించారు. ప్రధానంగా భవన నిర్మాణ కార్మికులకు కార్మిక సంక్షేమ శాఖ ద్వారా 2019 వరకూ ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేశాయి. టీడీపీ పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు భవన నిర్మాణ కార్మికులకు లేబర్ వెల్ఫేర్ బోర్డు ద్వారా కూడా సంక్షేమ పథకాలనూ అందజేశారు. 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలకే పరిమితం చేస్తూ, భవన నిర్మాణ కార్మికులకు లేబర్ వెల్ఫేర్ బోర్డు ద్వారా అందే సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ మెమో నెం.1214ను జారీ చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3లక్షలకు పైగా భవన నిర్మాణ కార్మికులున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక, భవన నిర్మాణానికి సంబంధించి అన్నిరకాల సామగ్రి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో నిర్మాణ రంగం మందగమనంలో పయనించింది. అసలే ధరల పెరుగుదలవల్ల పనుల్లేక అల్లాడిపోతుండగా... లేబర్ వెల్ఫేర్ బోర్డు ద్వారా అందే సంక్షేమ పథకాలు కూడా రాకపోవడంతో కార్మికులు లబోదిబోమ న్నారు. సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు కార్యాలయాల చుట్టూ తిరిగారు. ఇటీవల జిల్లా కార్మికశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఉపకమిషనర్ లక్ష్మీనరసయ్యకు వినతిపత్రం సమర్పించారు. అయితే ఈ నిరసనలపై ప్రభుత్వ యంత్రాంగం ఏమాత్రం స్పందించలేదు. ఇపుడు రాష్ట్రంలో ఎన్డీఏ అధికారం చేపట్టనుంది. ఇకనుంచైనా కార్మికుల సంక్షేమానికి పూర్వవైభవం తీసుకొస్తారని కార్మికులు ఆకాంక్షిస్తున్నారు.

భవన నిర్మాణరంగ కార్మికులు లేబర్ వెల్ఫేర్ బోర్డు ద్వారా లేబర్ కార్డును పొందితే సంక్షేమ పథకాలను అందించేవారు. కార్మికుడు పనిలో ఉన్నపుడు లేదా పని నుంచి ఇంటికి వెళ్లేటపుడు ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.5లక్షలు, శాశ్వత అంగవైకల్యానికి గురైతే రూ.2లక్షలు చొప్పున లేబర్ వెల్ఫేర్ బోర్డు ద్వారా ప్రమాద బీమాను అందించేవారు. కార్మికుడి పిల్లలకు వివాహం చేస్తే పెళ్లికానుక కింద రూ.10వేలు, ప్రసూతి ఖర్చులకోసం రూ.20వేలు, విద్యార్థుల స్కాలర్‌షిప్ కింద రూ.1200లు చొప్పున ఇచ్చేవారు. లేబర్ బోర్డుద్వారా ఇస్తే ముఖ్యమంత్రి పేరుకు ప్రచారముండదని భావించి ప్రభుత్వ యంత్రాంగం ఆ నిధులను వైఎస్ఆర్ కానుక కిందకు మార్చేశారు. ఈ పథకాలన్నీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో సంబంధం లేకుండా లేబర్ వెల్ఫేర్ బోర్డు ద్వారా మాత్రమే భవన నిర్మాణ కార్మికులకు అందేవి. ప్రస్తుత ప్రభుత్వం వీటన్నింటినీ రద్దు చేసి ప్రభుత్వం ద్వారా మాత్రమే అమలు చేస్తూ, ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన వారికి వైఎస్సార్‌బీమా కింద, పెళ్లి కానుకను వైఎస్సార్ కళ్యాణమస్తు కిందకు మార్చేశారు. ఇక ఆరోగ్యశ్రీని చూపుతూ మెటర్నిటీ ఖర్చులను ఇవ్వడం మానేశారు.

భవన నిర్మాణ కార్మికులకు దూరమైన పథకాలివే...

మా పథకాలు మాకే వర్తింపజేయాలి



కార్మికుల సంక్షేమంకోసం ఏర్పాటు చేయబడినది లేబర్ వెల్ఫేర్ బోర్డు. అయితే ఆ బోర్డు నిధులను వైసీపీ ప్రభుత్వం ఇతర శాఖలకు మళ్లించి కార్మిక రంగాన్ని నట్టేట ముంచింది. కార్మికశాఖను నిర్వీర్యం చేసింది. కొత్త ప్రభుత్వంలోనైనా మా పథకాలను తిరిగి ప్రవేశపెట్టి మాకే వర్తింపజేయాలి.

- టి.కుమార్, తాపీమేస్త్రీ



కార్మికశాఖ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు (ఫైల్)

సగానికి పైగా పనులు తగ్గిపోయాయి : ప్రకాష్, తాపీమేస్త్రీ



గతంలో ఏడాదికి కనీసం నాలుగైదు బిల్డింగ్ కాంట్రాక్టులను తీసుకుని పనులు చేయించేవాళ్లం. మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల సగానికి పైగా పనులు తగ్గిపోయాయి. దీంతో ఏడాదికి ఒకటి లేదా రెండు కాంట్రాక్టులకే పరిమితమవుతున్నాం. ఈ ప్రభుత్వంలోనైనా ధరలను నియంత్రించాలని కోరుకుంటున్నాం. అపుడే పనులు పెరుగుతాయి.

పనుల్లేక పస్తులు : లక్ష్మీదేవి, కూలీ



మెటీరియల్ ధరలు పెరిగిపోయి పనులు తక్కువవడం వల్ల మాలాంటి పేదల జీవనం కష్టంగా మారింది. పని ఉంటే కూలీ వస్తుంది, పనుల్లేనపుడు కొన్ని సందర్భాల్లో పస్తులున్న రోజులూ ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వంలోనైనా మెటీరియల్ ధరలను తగ్గిస్తే పనులు పెరిగి మాలాంటి వారి కడుపు నిండుతుంది.

భవన నిర్మాణ సామగ్రి విషయంలో టీడీపీ, వైసీపీ ప్రభుత్వాల్లో వ్యత్యాసాన్ని గమనిస్తే...

మెటీరియల్	టీడీపీ హయాంలో..	వైసీపీ హయాంలో..
ఇసుక	రూ.2500 (ట్రాక్టర్),	రూ.6500 (ట్రాక్టర్),
	రూ.6000 (టిప్పర్)	రూ.18000(టిప్పర్)
కంకర	రూ.2200 (ట్రాక్టర్)	రూ.4500 (ట్రాక్టర్)
స్టీల్	రూ.50 (కిలో)	రూ.80 (కిలో)
సిమెంటు	రూ.150 నుంచి 170 (బస్తా)	రూ.350 నుంచి 400 (బస్తా)
సిమెంటు బ్రిక్	రూ.16 (ఒక బ్రిక్)	రూ.27 (ఒక బ్రిక్)
ఇటుక పెల్ల	రూ.4 (ఒక బ్రిక్)	రూ.8 (ఒక బ్రిక్)

కొండెక్కిన మెటీరియల్ ధరలు

గత టీడీపీ ప్రభుత్వ పాలనలో భవన నిర్మాణ సామగ్రి(మెటీరియల్) ధరలతో పోలిస్తే వైసీపీ పాలనలో కొండెక్కాయి. దీంతో చాలావరకు నిర్మాణాలను వాయిదా వేసుకున్న పరిస్థితి. ఏడాదికి కనీసం 3 లేదా 4 భవనాల నిర్మాణ పనులకు కాంట్రాక్టు తీసుకునే మేస్త్రీలు 1 లేదా 2 పనులకే పరిమితమవాల్సి వచ్చింది. పనులు తక్కువవడంతో ఉన్న పనిలోనే తమ జీవనాధారంకోసం కూలి రేట్లను పెంచామంటున్నారు తాపీమేస్త్రీలు.

ప్రమాదాలు జరిగితే ఆదుకునేవారు లేరు



భవన నిర్మాణ పనులకు వెళ్లినపుడు ఏదైనా ప్రమాదం జరిగి మరణం లేదా అంగవైకల్యం కలిగితే కార్మిక సంక్షేమ శాఖ ద్వారా లేబర్ కార్డు పొందిన కార్మికులకు బీమా ఉండేది. గతనెల 29న మాతోపాటు పని చేసే మద్దిలేటి పునాది రాళ్లు తరలిస్తుండగా ట్రాక్టర్ బోల్తాపడి మృతిచెందాడు. అయినా లేబర్ వెల్ఫేర్‌బోర్డు ద్వారా అతడి కుటుంబానికి ఎలాంటి ఆర్థిక సాయం అందలేదు.

- మురళి, బేల్దారి

అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నా...



దాదాపుగా 20 సంవత్సరాలకు పైగా బేల్దారి పని చేస్తున్నా. ఏనాడూ ఇలాంటి పరిస్థితి లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోయి పనులు తగ్గిపోయాయి. దీనికితోడు నిత్యావసర సరుకుల ధరలూ పెరిగిపోయాయి. చేసేదేమీ లేక పనుల్లేని సమయాల్లో మా మేస్త్రీ వద్ద అప్పుచేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోంది. ఎట్టకేలకు ప్రభుత్వం మారింది. ఇప్పటికైనా ధరలను నియంత్రిస్తే మేలు.

- వన్నూరుస్వామి, బేల్దారి

కష్టాలు తీరుతాయని ఆశిస్తున్నాం



12 సంవత్సరాలుగా భవన నిర్మాణ కూలీగా పనిచేస్తున్నా. మాలాంటి కార్మికుల కోసం టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయాలి. ఇప్పటికైనా మా కష్టాలు తీరుతాయని ఆశిస్తున్నాం.

- మహాలక్ష్మి, కూలీ

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూన్ 13: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షం పడింది. అనంతపురం, గుంతకల్లు, కణేకల్లు, గార్లదిన్నె మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. బెలుగుప్ప, పామిడి, పుట్లూరు, యాడికి, గుత్తి మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. అలాగే బుధవారం రాత్రి జిల్లాలోని 27 మండలాల్లో వర్షం పడింది. అత్యధికంగా విడపనకల్లులో 54.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. డీ.హిరేహాల్ 48.0, వజ్రకరూరు 42.2, బెలుగుప్ప 40.2, బొమ్మనహాల్ 36.0, తాడిపత్రి 34.4, పామిడి 25.4, గుంతకల్లు 24.4, ఉరవకొండ 23.4, గార్లదిన్నె 22.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో 19.0 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది.



సిద్ధం చేసుకున్న మిరప విత్తనం



విత్తనం కోసం ఎండు మిరప కాయలను మిషన్‌కు వేస్తున్న రైతులు

మిరపసాగుకు సన్నద్ధం



అంగట్లో సిద్ధంగా ఉన్న వివిధ రకాలు మిరప విత్తన కాయలు

గత ఏడాది నష్టాలను లెక్క చేయని రైతులు
మిరప విత్తనాలు కోసం పరుగులు
విడపనకల్లులో పదుల సంఖ్యలో వెలసిన విత్తన విక్రయ దుకాణాలు

విడపనకల్లు, జూన్ 13: ఈసారి ఖరీఫ్ ప్రారంభం నుంచే వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండడంతో మిరప రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. గత ఏడాది మిరప రైతును నల్లి పురుగు, కాలర్ రాట్ వంటి తెగుళ్ల భయపెట్టి నష్టాలు పాలు చేశాయి. గత నష్టాలు కుంగదీస్తున్నా రైతులు మరోసారి మిరపను సాగు చేసే సాహసానికి సిద్ధమవుతున్నారు. ఈసారి ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సాగునీరు అందించి రైతులను ఆదుకుంటాడనే నమ్మకంతో ముందుకు సాగుతున్నారు. జూన్ చివరి వారం, జూలై మొదటి వారంలో మిరప సాగు మొదలవుతుంది. గత ఏడాది మొదట్లో వర్షాలు బాగానే వచ్చాయి. కాపు పట్టే సమయంలో వర్షాలు రాక నల్లిపురుగు సోకింది. దీనికి తోడు కాలర్ రాట్ దెబ్బతీసింది. దీంతో వేలాది ఎకరాల్లో పంట కుళ్లిపోయి ఎండిపోయింది. కొంత మంది రైతులు పంటను తొలగించకుండా చివరి వరకూ మందులు వాడి కాపాడుకున్నారు. చివరి దశలో కాలువ నీళ్లు బంద్ కావటంతో వేల ఎకరాల్లో పంట నష్టపోయారు. దిగుబడి అంతంత మాత్రమే వచ్చినా సరైన ధరలు లేక కర్ణాటకలోని ఏసీ గోడౌన్లలో నిలువ చేశారు. గత ఏడాది ఉరవకొండ నియోజక వర్గంలో సుమారు 65వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది 50వేల ఎకరాల దాకా సాగు చేయవచ్చని ఉద్యానశాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు. మిరప విత్తనాల కోసం విడపనకల్లు మండల కేంద్రానికి రాయదుర్గం, కళ్యాణదుర్గం, బళ్లారి, గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, బొమ్మనహాలు, కర్నూలు జిల్లా హాలర్వి, చిప్పగిరి, ప్రాంతాల నుంచి రైతులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఒక క్వింటా డబ్బి రకం విత్తనం రూ. 34 వేలు, కడ్డీ రకం విత్తనం రూ.18వేలు ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. ఏ రకం విత్తనం అయినా ఎకరానికి గొర్రుతో వేస్తే 5 నుంచి 6 కిలోలు, అదే కూలీల చేత వేయిస్తే 3 నుంచి 4 కిలోల విత్తనం కావాల్సి ఉంటుంది. నారు వేసి పంటలు ప్రారంభించే సరికి ఎకరాకు దాదాపుగా రూ. 20 వేలకు పైగా ఖర్చులు వస్తాయి. నారు పేరిగే కొద్ది పెట్టుబడులు పెరుగుతూ పోతాయి. విడపనకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో రైతులు ఎక్కువగా డబ్బి రకం సాగుకు మొగ్గు చూపుతారు. బొమ్మనహాలు, కణేకల్లు, కళ్యాణదుర్గం, కర్ణాటక రైతులు ఎక్కువగా కడ్డి రకం, 5531, తేజ రకం, కారం కాయలు సాగుకు మొగ్గు చూపుతున్నారు. విడపనకల్లు మండలంలో మిరప రకాన్ని బట్టి దిగుబడులు సింజెంటా బ్యాడిగి రకం ఎకరాకు 22 నుంచి 26 క్వింటాళ్లు, గుంటూరు నాటీ వెరైటీ ఎల్‌సీ రకం 28 నుంచి 31 క్వింటాళ్లు, బీఎస్ఎఫ్ ఆర్మూర్ రకం 30 నుంచి 40 క్వింటాళ్లు, డబ్బి రకం ఎకరాకు 25 నుంచి 30క్వింటాళ్లు, గుంటూరు కారం కడ్డీ రకం 20 నుంచి 25 క్వింటాల్లు దిగుబడులు వస్తాయి.

విక్రయాలు తగ్గిపోయాయి



గత ఏడాది ప్రతి రోజు 100 నుంచి 150 క్వింటాళ్ల విత్తన కాయలు విక్రయించే వాళ్లం. ప్రస్తుతం మే నెల నుంచి వ్యాపారం చేస్తున్నాం. రోజుకు కనీసం 100 క్వింటాళ్ల విత్తనం కూడా అమ్ముడుపోవటం లేదు. మిషన్‌కు వేయటం ద్వారా మిరప పొట్టును తీసుకుని విత్తనాన్ని వేసి ఇస్తున్నాం. మిరప పొట్టు వ్యాపారులకు లాభాలు లేకుండా విక్రయించాల్సి వస్తోంది.

- ఈశ్వర్, వ్యాపారి, విడపనకల్లు

జీబీసీ, హంద్రీనీవా జీవనాధారం

విడపనకల్లు మండలానికి జీవనాధారమై జీబీసీ (గంతకల్లు బ్రాంచ్ కెనాల్), హెచ్ఎల్‌సీ, బోరుబావుల కింద ఉరవకొండ నియోజకవర్గం రైతులు వేల ఎకరాల్లో మిరప పంటను వాణిజ్య పంటగా సాగు చేస్తుంటారు. కౌలు రైతులు ఎకరాకు రూ. 40 వేల నుంచి రూ.50వేలు కౌలు చెల్లించి మిరప సాగు చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమై జూన్ నెల వచ్చిందంటే మిరప రైతులకు పండుగ వాతావరణం ఉంటుంది. ఏ రకం విత్తనం వేయాలి, ధరలు ఎలా ఉంటాయంటూ చర్చించుకుంటూ సాగుకు సిద్ధమవుతుంటారు.

విడపనకల్లులోనే విత్తనం తీసుకుంటా



నేను గత సంవత్సరం నాలుగు ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాను. ఈ ఏడాది ఒక్క ఎకరం మాత్రమే సాగు చేస్తున్నా. విడపనకల్లులో విత్తనం బాగుంటుందని ఇక్కడికి వచ్చి తీసుకుంటున్నా. ప్రతి ఏటా రాయదుర్గం మండలం నుంచి వందల మంది రైతులు విడపనకల్లుకు వచ్చి విత్తనం కొనుగోలు చేసి తీసుకు వెళ్తున్నాం.

- అంజినప్ప, రైతు, పూలకుంట, రాయదుర్గం మండలం

అప్పులు తీరాలంటే మిరప సాగు చేయాల్సిందే



నేను ప్రతి ఏటా 10 ఎకరాలు మిరప సాగు చేస్తున్నా. గత ఏడాది మిరప పంట పూర్తిగా దెబ్బతిని రూ.లక్షల్లో నష్టం వచ్చింది. ఈసారి రెండున్నర ఎకరాల్లో మాత్రమే మిరప సాగు చేసి అప్పులు తీర్చుకోవాలనుకుంటున్నాను. దేవుడు కరుణిస్తే కనీసం ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చి మంచి ధరలు పలికితే కొంత ఊరట కలుగుతుంది. దేవుడిపై భారం వేసి ఈసారైనా అప్పులు తీర్చుకోవాలని మిరప సాగుకు సాహసం చేస్తున్నా.

-బొమ్మన్న, రైతు, పూలకుంట, రాయదుర్గం మండలం

వర్షాలు లేక నష్టపోయా



గత ఏడాది వర్షాలు లేక నష్టాలు పాలయ్యాను ఈ ఏడాది రెండు ఎకరాల్లో మిరప సాగు చేయాలని విడపనకల్లుకు వచ్చాను. విత్తనం కూడా పెద్ద ధరలు లేవు. కానీ లాభాలు రావాలంటే దిగుబడి అధికంగా వచ్చి ధరలు పలికితే గత ఏడాది చేసిన అప్పులు తీర్చుకోవచ్చు. అందుకే కొద్దిగానే పంటను సాగు చేస్తున్నా. ప్రతి ఏటా అప్పులపాలవుతున్నాను.

- భీమన్న, రైతు, రంగసముద్రం, రాయదుర్గం మండలం

బడిబాట



అనంతపురం నగరంలోని నంబర్-2 పాఠశాలలో సరస్వతి దేవికి పూజలు చేస్తున్న విద్యార్థినులు



- తెరుచుకున్న పాఠశాలలు
- ప్రభుత్వ స్కూళ్లలో పల్చగా విద్యార్థులు
- 20 శాతంలోపే హాజరు
- ఎమ్మార్సీల నుంచి స్కూళ్లకు కిట్లు

అనంతపురం విద్య, జూన్ 13: వేసవి సెలవుల తర్వాత గురువారం పాఠశాలలు తెరుచుకున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు బడిబాట పట్టారు. దీంతో పాఠశాలల ప్రాంగణాలు కిటకిటలాడాయి. పునఃప్రారంభం నేపథ్యంలో స్కూళ్లను ముస్తాబు చేశారు. విద్యార్థులకు స్వాగత తోరణాల మధ్య ఆహ్వానం పలికారు. పలు స్కూళ్లలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. స్టూడెంట్ కిట్లు సైతం ఎమ్మార్సీల నుంచి స్కూల్ పాయింట్‌కు చేరుస్తున్నారు.

తొలిరోజు అరకొరగానే..

జిల్లా వ్యాప్తంగా స్కూళ్లు తెరుచుకున్నా.. చాలా వాటిలో విద్యార్థులు చాలా తక్కువగా వచ్చారు. తొలిరోజు కావడం, చిరుజల్లులు పడుతుండటంతో విద్యార్థులు తక్కువగా హాజరయ్యారు. 20 శాతం మంది మాత్రమే హాజరైనట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. జిల్లాలోని ఎమ్మార్సీల నుంచి స్టూడెంట్ కిట్లను స్కూళ్లకు మండల విద్యాశాఖాధికారులు, ఇతర సిబ్బంది ప్రత్యేక వాహనాల్లో తరలించే పనికి శ్రీకారం చుట్టారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు


ప్రతి నెలా ఇరిగేషన్ టూర్ డైరీ

అధికారులకు కలెక్టరు వినోద్ కుమార్ ఆదేశాలు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు

అనంతపురం టౌన్, జూన్ 13: జిల్లాలో ఇరిగేషన్ శాఖలకు చెందిన అధికారులు ప్రణాళికతో అప్రమత్తంగా పనిచేయాలని, ప్రతినెలా ఇంజనీర్ టూర్ డైరీ అందించాలని కలెక్టరు వినోద్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో హెచ్ఎస్ఎస్ఎస్, హెచ్ఎల్‌సీ, ఇతర మైనర్ ఇరిగేషన్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్ఎన్ఎస్ఎస్, హెచ్ఎల్‌సీ, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈలు ప్రతినెలా తప్పకుండా ప్రధాన కార్యాలయాలకు వెళ్లాలని, అక్కడ జిల్లా సమస్యలు తెలుసుకొని రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. ప్రాజెక్టులు, కాలువల వివరాలు పూర్తిగా తెలిసేలా గూగుల్ మ్యాప్ తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలో ట్యాంకులు, రిజర్వాయర్లలో చెట్లు, మొక్కలు పెంపకానికి ఉన్న అవకాశాలను పరిశీలించి నివేదికలు ఇవ్వాలన్నారు. నిపుణులతో సంప్రదించి ఎలాంటి ఇబ్బంది లేకుండా చెట్లు, మొక్కలు పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టుల పరిధిలో ఏమైనా సమస్యలు వస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టరు బొల్లినేని వినూత్న, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశేనాయక్, డిప్యూటీ కలెక్టరు ఆనంద్, ఈఈలు రాజస్వరూప్, నారాయణనాయక్, ప్రతాప్, శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.



చంద్రబాబుపైనే.. ఆశలు



పుట్టపర్తిలోని ఆర్బీకే

- నాడు టీడీపీ హయాంలో కాంట్రాక్టు పద్ధతిలో ఎంపీఈఓల నియామకం
- వైసీపీ పాలనలో వారి జీవితాలతో చెలగాటం
- జనాభా ప్రాతిపదికన ఆర్బీకేల ఏర్పాటుతో అన్యాయం
- ఓడీపై చిత్తూరు జిల్లాకు 205 మంది..
- 50 మంది తొలగింపు
- ఇప్పుడైనా న్యాయం చేకూరేనా..?

అనంతపురం అర్బన్, జూన్ 13: వ్యవసాయ శాఖలో ఎంపీఈఓల జీవితాలతో వైసీపీ ప్రభుత్వం చెలగాటం ఆడింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాల వ్యవస్థను అమలు చేసింది. దీంతో అప్పటి దాకా వ్యవసాయ శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2015 సంవత్సరంలో జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా అనంత ఉమ్మడి జిల్లాలో 650 మంది ఎంపీఈఓలను (మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్)ను కాంట్రాక్టు పద్ధతిలో, 1000 హెక్టార్లకు ఒకరి చొప్పున నియమించారు. వీరంతా వ్యవసాయ శాఖ తరఫున క్షేత్రస్థాయిలో పనిచేస్తూ వచ్చారు. తమ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉంటూ ఈ క్రాపింగ్, పంటల సాగులో పాటించాల్సిన పద్ధతులపై రైతులకు వివరించడం వీరి ప్రధానమైన కర్తవ్యం. వైసీపీ అధికారంలోకి రాగానే గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. రైతు భరోసా కేంద్రాల్లో కొత్తగా వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశుసంవర్ధక శాఖ తరఫున గ్రామ స్థాయి సిబ్బందిని నియమించింది. ఆర్బీకే సిబ్బంది నియామకాలతో ఎంపీఈఓలకు గడ్డుకాలం మొదలయ్యింది. అయితే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించి, సీఎంగా చంద్రబాబునాయుడు కావడంతో తమకు న్యాయం జరుగుతుందన్న ఆశాభావంతో ఎంపీఈఓలు ఉన్నారు.

ఆర్బీకేల ఏర్పాటుతో అన్యాయం

జిల్లాలో జనాభా ప్రాతిపదికగా ఆర్బీకేలను ఏర్పాటు చేశారు. రెండువేల మంది జనాభాకు ఒక ఆర్బీకే సిబ్బందిని నియమించారు. జిల్లాలో ఖరీఫ్, రబీ సాగు విస్తీర్ణం ఎక్కువే. అనంత జిల్లావ్యాప్తంగా వ్యవసాయ శాఖ పరంగా 9.31 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఉద్యానశాఖ పరంగా 1.22 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఈ రెండు శాఖల తరఫున మొత్తం 10.53 లక్షల ఎకరాల్లో ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో ప్రతి వెయ్యి హెక్టార్లకు (2500 ఎకరాలు) ఒక ఎంపీఈఓ చొప్పున నియమించారు. అనంతలో 455, సత్యసాయిలో 416 రైతు భరోసా కేంద్రాలున్నాయి. గతంలో ఒక ఎంపీఈఓకు 2500 ఎకరాల పరిధి ఉండేది. ఆర్బీకే ఏర్పాటైన తర్వాత జనాభాను పరిగణలోకి తీసుకోవడంతో ఎంపీఈఓకు తీరని అన్యాయం జరిగింది. వైసీపీ ప్రభుత్వం వింత నిర్ణయాలతో ఎంపీఈఓలు తమ ఉద్యోగాలకు దూరం కావాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. మరోవైపు జనాభా ప్రాతిపదికగా ఆర్బీకేలు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించడంతో పనిభారం ఎక్కువై సతమతమవుతున్నారు. జిల్లాలోని కొన్ని ఆర్బీకేల పరిధిలో 4వేల నుంచి 10 వేల ఎకరాల విస్తీర్ణంలో పంట పొలాలున్నట్లు సమాచారం. ఆయా ఆర్బీకేల పరిధిల్లో సిబ్బంది ఈ క్రాపింగ్‌తోపాటు ఫీల్డ్ వెరిఫికేషన్, ఈకేవైసీ, వేరుశనగ, ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ, శాఖాపరంగా ఇతర రకాల పనులు చేస్తూ అధిక పనిభారంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు చిత్తూరు జిల్లాలో కేవలం 120 ఎకరాల నుంచి 300 ఎకరాలకు ఒక ఆర్బీకేని ఏర్పాటు చేయడం గమనార్హం. ఆ జిల్లాలో 2వేల మంది జనాభాకు ఒక ఆర్బీకే ఏర్పాటు చేయడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. చిత్తూరులో జరిగిన తప్పిదాన్ని సరిదిద్దుకోకపోగా.. అనంతలో పనిచేసే ఎంపీఈఓలను బలిపశువులను చేసి ఓడీపై అక్కడ పనిచేయిస్తూ ఇబ్బందులకు గురిచేయడం దారుణం.

ఓడీపై 205 మంది చిత్తూరుకు..

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి అనంత జిల్లాలో 650 మంది ఎంపీఈఓలు పనిచేసేవారు. వీరిలో 175 మంది వీఏఏలుగా ఎంపికయ్యారు. మిగతా 475 మంది ఎంపీఈఓలు అలాగే మిగిలిపోయారు. జనాభా ప్రాతి పదికన పోస్టులు కేటాయించడంతో, ఇక్కడ ఖాళీ లేవన్న కారణంతో 2020 సంవత్సరంలో 205 మంది ఎంపీఈఓలను ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపారు. ప్రస్తుతం వీరిలో 107 మంది ఉమ్మడి చిత్తూరులో పనిచేస్తున్నారు. మిగిలిన వారిలో అనారోగ్యం, ప్రసూతి సెలవులు, ఆర్థిక, కుటుంబ పరమైన సమస్యలతో ఓడీపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేయలేక తిరిగి వచ్చారు. మరికొందరు ఓడీపై వెళ్లలేక మిన్నకుండిపోయారు. మరికొందరికి చిత్తూరుకు ఓడీపై బదిలీ ఉత్తర్వులు ఇవ్వకుండానే పక్కనపెట్టారు. సదరు సిబ్బంది అప్పట్లో సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపానపోలేదు. ఇలా అనంత జిల్లాలో 50 మంది, సత్యసాయిలో 48 మంది ఎంపీఈఓలు నాట్ వర్కింగ్‌లో ఉండిపోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓలు రూ.12వేల వేతనం కోసం తప్పని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతూనే అక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న తమకు తిరిగి జిల్లాలోనే పోస్టింగ్‌లు ఇచ్చి ఆదుకోవాలని బాధిత ఎంపీఈఓలు కోరుతున్నారు.

50 మంది ఎంపీఈఓలు ఔట్

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై వెళ్లలేదన్న కారణంతో 50 మంది ఎంపీఈఓలను జిల్లా వ్యవసాయ యంత్రాంగం ఇటీవల ఉద్యోగం నుంచి నిర్దాక్షిణ్యంగా తొలగించింది. ఓడీపై చిత్తూరు జిల్లాకు ఎంపీఈఓలను పంపాలని నిర్ణయించిన నాటి నుంచి ఎంపీఈఓల సంఘం నాయకులు ఓడీపై చిత్తూరు జిల్లాకు సిబ్బందిని పంపకుండా జిల్లాలోనే ఉద్యోగ అవకాశం కల్పించాలని వైసీపీ పాలకులు, వ్యవసాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు అనేక మార్లు కోరుతూ వచ్చారు. జిల్లాలో 1500 ఎకరాలకు ఒక ఎంపీఈఓ పోస్టును కేటాయిస్తే సమస్య పరిష్కారమవుతుందని విన్నవిస్తూ వచ్చారు. ఎంపీఈఓల సంఘం విన్నపం మేరకు సిబ్బంది ఇబ్బందులను గుర్తించిన వ్యవసాయ కమిషనర్ 2023 ఆఖరులో 1500 ఎకరాలకు ఒక ఎంపీఈఓను నియమించేలా ఫైల్ సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిసింది. ఎన్నికల కారణంగా ఆగిపోయిన ప్రక్రియ, ఇప్పుడైనా కదిలేనా అని ఎంపీఈఓలు మళ్లీ ఆశాభావంతో ఉన్నారు. ఎక్కడా లేని విధంగా జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులు ఓడీపై చిత్తూరుకు వెళ్లని 50 మంది ఎంపీఈఓలను ఉద్యోగం నుంచి తొలగించడంతో బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అనంత రూరల్ మండలంలో పనిచేసే ఓ మహిళా సిబ్బంది అనారోగ్యంతో సెలవులో ఉండగా.. ఓడీపై వెళ్లని సిబ్బందితోపాటు ఆమెకు టర్మినేట్ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. ఇలా పలు కారణాలతో సెలవులో ఉన్నా వారిపై ఏ మాత్రం జాలి లేకుండా తొలగించారు. రాష్ట్రంలో మళ్లీ టీడీపీ ప్రభుత్వం ఏర్పడడంతో వారి ఉద్యోగాలపై ఆశలు చిగురిస్తున్నాయి.

1500 ఎకరాలకు ఒక ఎంపీఈఓను నియమించాలి

: నాగరాజు, ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



టీడీపీ హయాంలో ఎంపీఈఓలుగా ఉద్యోగ అవకాశం కల్పించారు. వైసీపీ అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి మాకు తీరని అన్యాయం చేశారు. ఆర్బీకేలు ఏర్పాటు చేసి మా కడుపు కొట్టారు. జిల్లా నుంచి ఓడీపై ఉమ్మడి చిత్తూరుకు బదిలీ చేసిన ఎంపీఈఓలందరినీ తిరిగి జిల్లాలో పోస్టింగ్ ఇవ్వాలి. తొలగించిన 50మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలి. జిల్లాలో ప్రతి 1500 ఎకరాల విస్తీర్ణానికి ఒక ఎంపీఈఓను నియమిస్తే సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. వైసీపీ నేతలకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు. త్వరలో సీఎం చంద్రబాబును కలిసి మాకు న్యాయం చేయాలని కోరుతాం. టీడీపీ ప్రజా ప్రతినిధుల దృష్టికి మా ఆవేదనను తీసుకెళతాం.

అనంతలో తిరిగి పోస్టింగ్ ఇవ్వాలి

: రెడ్డి ప్రసాద్, రాయలసీమ జోన్ అధ్యక్షుడు



అనంత ఉమ్మడి జిల్లాకు చెందిన 98 మంది ఎంపీఈఓలు ఓడీపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్నారు. వీరిలో అత్యధికంగా మహిళా సిబ్బంది ఉన్నారు. ఆర్బీకే సిబ్బందితో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఎంపీఈఓలకు తక్కువ వేతనం ఇవ్వడం సరైంది కాదు. ఇప్పటికైనా ఉమ్మడి చిత్తూరులో పని చేసే ఎంపీఈఓలకు తిరిగి జిల్లాలో పోస్టింగ్ ఇప్పించేలా ప్రత్యేక చర్య లు తీసుకోవాలి. టర్మినేట్ చేసిన ఎంపీఈఓలకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలి.



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తెలుగు యువత నాయకులు


మెగా డీఎస్సీపై సీఎం తొలి సంతకం

తెలుగు యువత సంబరాలు

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

అనంతపురం అర్బన్, జూన్ 13: ఎన్నికల హామీ మేరకు మెగా డీఎస్సీపై సీఎం చంద్రబాబునాయుడు తొలి సంతకం చేయడంపై తెలుగు యువత నాయకులు సంబరాలు చేశారు. గురువారం స్థానిక రఘువీరాకాంప్లెక్స్ వద్ద తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడుపూటి నారాయణస్వామి డీఎస్సీ అభ్యర్థులతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న హామీని వైసీపీ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. నిరుద్యోగులను జగన్ నట్టేట ముంచాడన్నారు. అందుకే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి నిరుద్యోగులతోపాటు అన్ని వర్గాల ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. ఎన్నికల హామీ మేరకు సీఎం చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీపై తొలి సంతకం పెట్టడం శుభపరిణామన్నారు. నిరుద్యోగులు చంద్రబాబు నిర్ణయంపై ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు మద్దినేని కృష్ణ, కృష్ణగోపాల్, వెంకట్, రంగంపేట బాలు, రాజేంద్ర, గణేష్, నరసింహులు, తిరుమలేష్, నాగేంద్ర, రమేష్, చక్రి, శివ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపుపై వృద్ధులు..



కేక్ కట్ చేస్తున్న వృద్ధులు

అనంతపురం కల్చరల్: సామాజిక పింఛన్ల పెంపును హర్షిస్తూ గురువారం వైశ్యా హాస్టల్ కాంపౌండ్‌లోని వృద్ధాశ్రమంలో సంబరాలు చేసుకున్నారు. మాజీ కార్పొరేటర్ క్రిష్ణం ప్రసన్న లక్ష్మీ, క్రిష్ణం రఘు, ఆరవేటి శ్రీధర్ సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధులు కేక్ కట్‌చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు క్రిష్ణం రఘు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం సందర్భంగా పింఛన్ల పెంపుపై చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి ఒక్కొక్క నెలకు రూ.వెయ్యి చొప్పున 3వేలు, జూలైలో రూ.4వేలు పింఛన్‌తో కలుపుకుని మొత్తం రూ.7వేలు అందజేయనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధులు జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, క్రిష్ణయ్య, రమణయ్య, శ్రీరాములు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో ఎనిమిది మందికి గాయాలు

నల్లమాడ, జూన్ 13: మండలంలోని కుటాలపల్లి గ్రామానికి చెందిన ఎనిమిదిమంది గురువారం తేనేటీగల దాడిలో గాయపడ్డారు. మొక్కజొన్న పంటకు మందులు పెడుతుండగా తేనేటీగలు దాడిచేశాయి. దాడిలో ఎనిమిదిమంది గాయపడగా వారిని చికిత్సనిమిత్తం నల్లమాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇప్పుడైనా ఇస్తారా..?

- పెండింగ్ బిల్లుల కోసం ఎదురు చూపు
- నీరు-చెట్టు, ఎస్‌డీఎఫ్ డబ్బు వచ్చేనా...?
- వైసీపీ కక్ష సాధింపుతో చితికిపోయిన టీడీపీ శ్రేణులు
- సీఎం చంద్రబాబు కనికరించాలంటున్న కాంట్రాక్టర్లు

బుక్కరాయసముద్రం, జూన్ 13: వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలతో గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించ కుండా వేధించింది. దీనిపై స్పందించిన చంద్రబాబునాయుడు తమ పార్టీ అధికారంలోకి రాగానే ఆ బిల్లులన్నింటిని వడ్డీతో చెల్లిస్తానని హామీ ఇచ్చారు. అనుకున్నట్లుగానే ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో ఆర్థికంగా చితికిపోయిన తమకు ఇప్పుడైనా నాడు చేసిన పనులకు బిల్లులు మంజూరు అవుతాయా అని టీడీపీ శ్రేణులు ఎదురుచూస్తున్నాయి. శింగనమల నియోజకవర్గంలోని గ్రామీన ప్రాంతాల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి నీరు- చెట్టు, సీసీరోడ్లు, కాలువలు వంటి పనులు చేశారు. ఈ పనులను టీడీపీ వారు చేశారనే కారణంతో వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా బిల్లులు చెల్లించలేదు. దీంతో పనులు చేసిన వారు ఆర్థికంగా చితికిపోయారు. హైకోర్టు ఆదేశించినా ఈ నియోజకవర్గంలో మాత్రం 80 శాతం పనులకు డబ్బులు ఇవ్వలేదు. కొంత మందికే మాత్రమే బిల్లుల మంజూరు చేశారు.

ఆన్‌లైన్‌లో నీరు-చెట్టు పనుల తొలగింపు

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నీరు- చెట్టు పథకం కింద ఇరిగేషన్ శాఖ పరిధిలో చెరువులు, నీటి కాలువలలో పూడికి తీత, హెచ్చెల్సీ ఆయకట్టు అభివృద్ధి పనులు, చెక్‌డ్యాంలు పునరుద్ధరణ, కొత్త చెక్‌డ్యామ్‌లు నిర్మాణం వంటి పనులను చేపట్టారు. 2017 నుంచి 2018 వరకు నియోజకవర్గంలో 352 పనులను చేపట్టారు. ఈ పనులను అప్పట్లో నీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు, డైరెక్టర్లు సభ్యులు చేపట్టారు. ఈ పనులకు రూ.10 కోట్లపైగా వెచ్చించారు. పూర్తిచేసిన పనులను అప్పట్లో క్వాలిటీ కంట్రోల్ అధికారులు, తనిఖీ చేసి ఎం.బుక్‌లో నమోదు చేసిన అనంతరం బిల్లు క్లియరెన్స్ కోసం సీఎఫ్ఎంఎస్ అప్‌లోడ్ చేశారు. ఇది జరిగిన కొద్ది రోజులకే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో బిల్లుల చెల్లింపు ఆగిపోయింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు నీరు -చెట్టు పనుల బిల్లులను పెండింగ్‌లో పెట్టారు. చివరికి చేసిన పనులను ప్రభుత్వ రికార్డులల్లోనే లేకుండా ఇరిగేషన్ అధికారులు తొలిగించారు. ప్రస్తుతం నాడు చేసిన పనులుకు ఎంబుక్‌ల ఆధారంగా బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

ఎస్‌డీఎఫ్ బిల్లులోనూ కక్ష సాధింపు

టీడీపీ హయాంలో ఎస్‌డీఎఫ్ నిధులు, ఉపాధి హామీ పథకం నిధులను అనుసంధానం చేసి గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సిమెంట్ రోడ్డు పనులను చేపట్టారు. చేసిన పనుల్లో నాణ్యత లేదనే సాకుతో వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుండా రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. నియోజకవర్గవ్యాప్తంగా ఆరు మండలాల్లో దాదాపు 260 సిమెంటు రోడ్లు వేశారు. వాటికి అప్పట్లో రూ.11 కోట్లకుపైగా బిల్లులు రాకుండా వైసీపీ అడ్డుకుంది. దీంతో టీడీపీ సానుభూతిపరులు నష్టపోయారు.

20శాతం కోతతో బిల్లుల మంజూరు

టీడీపీ హయాంలో చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కొంత మంది కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో చేసిన పనిలో 20శాతం కోత విధించి ప్రభుత్వం బిల్లులను ఇచ్చింది. దీంతో పని చేసిన కాంట్రాక్టర్‌కు సరైన సమయంలో డబ్బు రాకపోవడంతో పాటు వడ్డీని కూడా నష్టపోయినట్లైంది. పైగా 20శాతం కోత విధించడంతో కాంట్రాక్టర్‌కు తీవ్రనష్టం వాటిల్లింది. వీటితోపాటు 2014-17 వరకు చేపట్టిన ప్రభుత్వ పనులుకు సంబంధించి ప్రతి పనిలో 5 శాతం డిపాజిట్లు పట్టుకున్నారు. పని చేసిన అనంతరం రెండు సంవత్సరాలలో పనిలో నాణ్యత లోపిస్తే.. డిపాజిట్టులోని నగదును మరమ్మతులకు ఉపయోగిస్తారు. 5 శాతం డిపాజిట్టు సొమ్మును ఇవ్వాలని పంచాయతీ రాజ్ అధికారులను కాంట్రాక్టర్లు అడిగితే... డిపాజిట్టు సొమ్ములేదని, వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేసిందని సమాధానం చేబుతున్నారన్నారు.

ఆర్థికంగా చితికిపోయాం..



ఆరేళ్ల కిందట బుక్కరాయముద్రంలోని దేవరకొండ దేవాలయంపైకి సిమెంట్ రోడ్డు పనులు చేపట్టాం. కోటికిపైగా ఖర్చు చేసి, 50 శాతంపైగా పనులు చేశాం. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేసే పనిని దౌర్జన్యంగా నిలబెట్టించారు. చేసిన పనికి బిల్లులు చెల్లించకుండానే, చేసిన వర్క్‌ను తిరిగి వైసీపీ నేతలు చేసి బిల్లులు డ్రా చేసుకున్నారు. చేసిన పనికి ఇప్పటి వరకు బిల్లులు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహించారు. దాదాపు కోటి రూపాయలు అప్పు చేసి పనులు చేయడంతో వడ్డీలు కట్ట లేక భూమిని అమ్మి అప్పులు కట్టా.

-లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్, బీకేఎస్

బిల్లులు వెంటనే ఇవ్వాలి..



గ్రామాల్లో పోటీ పడి సిమెంట్ రోడ్లు, నీరు చెట్టు పనులు చేపట్టాం. గత ఐదేళ్లుగా బిల్లులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. ప్రస్తుతం ఆర్థికంగా చితికి పోయా. రూ.35 లక్షల మేరకు బిల్లులు రావాల్సి ఉంది. ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు కనికరించి వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నాం. ఇన్నాళ్లు ఎంతగానో ఎదురు చూశాం. టీడీపీ పాలనలో కూడా బిల్లులు రాకపోతే... ఇక మాకు ఆత్మహత్యలే శరణ్యం.

- నారాయణస్వామి, మాజీ సర్పంచ్, చెదల్ల గ్రామం

ఏడీసీసీ బ్యాంకు సీఈఓగా సురేఖారాణి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 13: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వందేళ్ల చరిత్రలో మొట్టమొదటి మహిళా సీఈఓగా సురేఖారాణి నియమితులయ్యారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో ఏడీసీసీ బ్యాంకు రెగ్యులర్ సీఈఓగా సురేఖారాణి బాధ్యతలు స్వీకరించారు. అవినీతి, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో సీఈఓ ఏబీ రాంప్రసాద్ రాజీనామా చేశారు. దీంతో ఏడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్‌గా ఉన్న సురేఖారాణికి సీఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఈఓ ఏబీరాంప్రసాద్ రాజీనామాపత్రాన్ని ప్రభుత్వం ఆమోదిస్తూ జీఎం సురేఖారాణిని రెగ్యులర్‌గా నియమిస్తూ ఆప్కాబ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన సురేఖారాణి మాట్లాడుతూ... ఉద్యోగులు సమష్టిగా పనిచేసి 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని కోరారు. బాధ్యతలు స్వీకరించిన సురేఖారాణికి బ్యాంకు అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు.



సీఈఓను అభినందిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

30 తులాల బంగారం చోరీ

అనంతపురం క్రైం, జూన్ 13: నగరంలో పట్టపగలే 30 తులాల బంగారు నగలు, రూ. 37,500 చోరీ అయ్యాయి. నగరంలోని భవానీనగర్‌లో నివాసముంటున్న చంద్రమోహన్‌రెడ్డి దంపతులు కమలానగర్‌లో ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం దుకాణానికి వెళ్లినవారు మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. ఇంటి తాళాలు పగలకొట్టి ఉండటం చూసి అవాక్కయ్యారు. ఇంట్లోకి వెళ్లి చూడగా.. లాకర్‌లో ఉండాల్సిన 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.37,500 నగదు కనిపించలేదు. దీనిపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

4 నెలలు.. ఎన్నో అద్భుతాలు..



చిన్నారిని, తల్లిదండ్రులను అభినందిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, జూన్ 13: నోబెల్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిన్నారి క్రిష్టినా సియారా పేరు నమోదుకావడం జిల్లాకే గర్వకారణమని కలెక్టరు వినోద్‌కుమార్ కొనియాడారు. గుంతకల్లు పట్టణానికి చెందిన రైల్వే ఉద్యోగి సుధాకర్, సింధు దంపతుల నాలుగు నెలలచిన్నారి క్రిష్టినా సియారా. ఫ్లాష్‌కార్డు (ఆల్ఫాబెట్స్, అనిమల్స్, ఫ్రూట్స్, బర్డ్స్)ను అతిచిన్న వయసులో గుర్తించడంతో ఆ చిన్నారి పేరు నోబెల్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదైంది. ఈ నేపథ్యంలో గురువారం ఆ చిన్నారితో తల్లిదండ్రులు.. కలెక్టరును కలిశారు. ఆ చిన్నారిని కలెక్టరు అభినందించి, ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు.

దరఖాస్తు చేసుకోండి..

పుట్టపర్తి రూరల్, జూన్ 13: వెంకటగిరి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్స్ టెక్నాలజీ కోర్సు ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా చేనేత జౌళి శాఖాధికారి రమేష్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. 10వతరగతి పాసైన విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, ఐటీఐలో పాసైన విద్యార్థులకు నేరుగా రెండో సంవత్సరంలోకి ప్రవేశం కల్పిస్తారన్నారు. వయసు 15-23 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గరిష్ఠ వయోపరిమితి 25 సంవత్సరాలన్నారు. మొదటి సంవత్సరంలో రూ.1100, రెండో సంవత్సరంలో రూ.1200 స్టైఫండ్ ఇస్తారన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి www.iihtvgr.com వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. 08625-295003, 9399936872, 9866169908, 9010243054 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సంక్షిప్తంగా..

అహుడా చైర్మన్ రాజీనామా ఆమోదం

అనంతపురం క్రైం, జూన్ 13: అనంతపురం-హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ (అహుడా) చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ రాజీనామాను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఆయన మూడురోజుల క్రితం రాజీనామా చేశారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా పట్టణాభివృద్ధి సంస్థల చైర్మన్ల రాజీనామాలను ఆమోదించింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం మహాలక్ష్మి శ్రీనివాస్‌కు ఆ పదవి కేటాయించారు. పదవీ కాలం ముగిసిన అనంతరం మరోసారి ఆయననే కొనసాగించారు. రెండేళ్ల పాటు ఈ పదవీకాలం ఉంటుంది. అహుడా నూతన చైర్మన్‌గా ఎవరిని నియమిస్తారనే అంశంపై చర్చనీయాంశంగా మారింది.

నేడు డయల్ యువర్ డీఎం

అనంతపురం కల్చరల్, జూన్ 13: ఏపీఎస్ఆర్టీసీ అనంతపురం రీజియన్ ఆధ్వర్యంలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అనంతపురం డిపో మేనేజర్ నాగభూపాల్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటలలోపు ఆర్టీసీ ప్రయాణికులు 08554-248553, 9959225853 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

అనంతపురంరూరల్, జూన్ 13: నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డి-2 సెక్షన్ ఏఈఈ నాగవేణి తెలిపారు. శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆర్ట్స్ కళాశాల సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్, రామచంద్రనగర్, షిర్డీనగర్, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

చేనేత, వస్త్ర కోర్సుల్లో ప్రవేశాలు

అనంతపురం సెంట్రల్, జూన్ 13: చేనేత, వస్త్ర సాంకేతిక (డీహెచ్‌టీటీ) డిప్లమో కోర్సుల ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి అప్పాజి గురువారం ప్రకటనలో తెలిపారు. కోర్సు పూర్తిచేసిన వారి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని పేర్కొన్నారు. తిరుపతిలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఈ కోర్సులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 20న నిర్వహించే అడ్మిషన్ల ప్రక్రియ సందేహాలపై 94417 95408, 98661 69908, 90102 43054 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగాలు

అనంతపురం సెంట్రల్, జూన్ 13: ప్రముఖ కార్పొరేట్ సంస్థల్లో పనిచేసేందుకు 95 మంది ఐటీఐ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గురువారం అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం 242 మంది విద్యార్థులకు విప్రో, ఆల్టాటిక్ తదితర సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో ప్రతిభ కనబర్చిన 95 మంది ఉద్యోగాలకు ఎంపియ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు.

మాతాశిశు మరణాలను నివారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

అనంతపురం టౌన్, జూన్ 13: మాతాశిశుమరణాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.బీ.దేవి సూచించారు. జిల్లా కార్యాలయంలో గురువారం మాతాశిశుమరణాలపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. గతనెలలో జరిగిన మరణాలు దానికి కారణాలు గురించి ఆరా తీశారు. హైరిస్క్ గర్భిణీలను గుర్తించి వారు ప్రసవం చెందే వరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్, డీఐఓ డాక్టర్ యుగంధర్, పలువురు డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష కేంద్రం తనిఖీ

బుక్కరాయసముద్రం : కొర్రపాడులోని సమగ్ర శిక్ష ప్రాంతీయ శిక్షణ కేంద్రాన్ని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త మైకేల్ నిదియాదేవి గురువారం తనిఖీ చేశారు. ఇక్కడ అదనపు సౌకర్యాల గురించి ఆరా తీశారు. కేంద్రంలో మొక్కలు నాటారు. ఆమె వెంట ఈఈ శంకరయ్య, డీఈ జయరాములు ఉన్నారు.


రేపు వలీస్వామి ఆరాధనోత్సవం

అనంతపురం కల్చరల్, జూన్ 13: స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని వలీస్వామి ఆశ్రమంలో శనివారం వలీస్వామి 13వ ఆరాధనోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ కార్యదర్శి దేవనూరు సుందరం విజయ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 8 గంటలకు వెంకటాపురంలోని సాయి కృపానిలయంలో వలీస్వామి మహాసమాధికి గంధంపూజ అభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు నగరంలోని హెచ్చెల్సీ కాలనీ వలీస్వామి ఆశ్రమంలో వలీస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

పరిశోధనలే సమాజ మార్పునకు నాంది

అనంతపురం సెంట్రల్: ప్రజల అవసరాలను సులువుగా తీర్చేలా చేసే పరిశోధనలే సమాజ మార్పునకు నాంది అని జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. జేఎన్‌టీ యూలో నిర్వహించనున్న పరిశోధన ప్రాజెక్టుల వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. జాతీయ ఉన్నత విద్యామిషన్ రూసా ద్వారా రూ.86 లక్షల నిధులను మంజూరుచేసిందన్నారు. ఈ నిధులతో నానో కాంక్రీట్, మూర్ఛవ్యాధి టెస్టింగ్, మెడికల్ ఇమేజ్ అనాలసిస్, ఎలక్ట్రోడ్ మెటీరియల్, ఇథనాల్ బయోఫ్యూయల్, మాగ్నటో హైడ్రానిక్, అఫైడ్ ఫాలింగ్ డౌన్ జాకెట్, ఐరన్ ఓవర్ వేస్ట్ అంశాలపై పరిశోధనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

రాప్తాడు, జూన్ 13: రాప్తాడు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఓ దాబా దగ్గర గురువారం గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం ఉండటాన్ని గమనించిన స్థానికులు.. డయల్ 100కు సమాచారం అందించారు. రాప్తాడు పోలీసులు వెంటనే ఆ స్థలానికి చేరుకొని.. మృతదేహాన్ని పరిశీలించారు. వృద్ధుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియలేదు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

చికిత్స పొందుతూ జార్ఖండ్ వాసి...

అనంతపురం క్రైం, జూన్ 13: రోడ్డు ప్రమాదంలో గాయపడిన జార్ఖండ్‌కు చెందిన మహమ్మద్ (30) చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులోని ఓ గుజిరీ షాపులో పనిచేస్తుండేవాడు. బుధవారం రాత్రి గుత్తిరోడ్డులో బైక్‌లో వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలకు గురైన అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

వైసీపీ హయాంలో నాసిరకంగా నిర్మాణాలు

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



ఆర్బీకే ఎదుట నిలిచిన వర్షపు నీటిని, పునాదుల కింద నుంచి వస్తున్న ఊటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



రామగిరి, జూన్ 13: వైసీపీ ప్రభుత్వంలో నాసిరకంగా భవన నిర్మాణాలు చేపట్టారని, మండలంలోని అలాంటి భవనాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి.. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. గురువారం రామగిరి మండలంలోని నసనకోట పంచాయతీలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనం పునాదుల నుంచి ఊట నీరు వస్తుండటాన్ని.. ఆ భవనం చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండటాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. వైసీపీ పాలకులు అక్రమ ధనార్జనే ధ్యేయంగా పని చేశారనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఇలాంటి భవనాల వద్ద ఎలాంటి ప్రమాదమూ జరగకుండా చూడాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు సూచించారు. భవనం చుట్టూ ఫెన్సింగ్ కొట్టి ఊట నీరు వల్ల భవనం పునాదులు దెబ్బతినకుండా చూడాలన్నారు.

విద్యాసామగ్రి అందజేత

మండలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నసనకోట మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే పరిటాల సునీత గురువారం సందర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్, టీచర్లతో మాట్లాడారు. ప్రిన్సిపల్‌తో పాఠశాలలోని సమస్యలు, తదితర వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా నోట్ పుస్తకాలు, దుప్పట్లు, ప్లేట్లు ఆమె.. విద్యార్థినులకు అందజేశారు.



అనంతపురంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న స్వరూప, మహిళలు



కక్కలపల్లిలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు

కొనసాగిన టీడీపీ సంబరాలు

అనంతపురం అర్బన్, జూన్ 13: సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మాజీ మేయర్ స్వరూప చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గురువారం 30వ డివిజన్ పరిధిలోని అరవిందనగర్‌లో శివసాయి మహిళా సంఘం సభ్యులతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు ప్రశాంతి, నాగేంద్రమ్మ, రాధా, వనజ, నాగమణి, పూజ, శ్రీదేవి, పర్వీన పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మండలంలోని కక్కలపల్లిలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. హిందుపురం పార్లమెంట్ బీసీ సెల్ కార్యదర్శి నారాయణస్వామి ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. బాణా సంచాన పేల్చి.. రంగులు చల్లుకుని, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బండి నరసింహులు, వెంకటేష్, అన్వర్‌బాషా, నాగేష్, శంకర్‌రెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో..: మండలంలోని చియ్యేడులో టీడీపీ విజయంపై నాయకులు దేవుళ్లకు మొక్కులు చెల్లించుకున్నారు. చియ్యేడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నాయకులతో ర్యాలీగా వెళ్లుతూ.. గ్రామంలోని దేవుళ్లకు 101 టెంకాయలు కొట్టి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రాయుడు, రమణమ్మ, రాంమూర్తి, పరమేశ్వరరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

గార్లదిన్నె: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా.. గురువారం మండలంలోని కల్లూరులో నీలం సంజీవరెడ్డి సర్కిల్లో టీడీపీ నేతలు చంద్రబాబు ఫొటోకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం 101 కొబ్బరికాయాలు కొట్టి, బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు బొగ్గుల వెంకటేసు, వడ్లరాము, టీఎన్‌టీయూసీ జిల్లా అధికార ప్రతినిధి బాబయ్య, తెలుగుయువత జిల్లా కార్యదర్శి జగదీష్, సుధాకర్‌రెడ్డి, గంగాధర్, సునిల్, శ్రీనాథ్, రామకృష్ణ, నాగేంద్ర, మునిశేఖర్, చంద్రాయుడు, రామచంద్ర, సామాల రామాంజి పాల్గొన్నారు.





చియ్యేడు, కల్లూరులో కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

విద్యాసంస్థల దోపిడీపై ధర్నాలు, నిరసనలు

అనంతపురం విద్య, జూన్ 13: జిల్లాలో స్కూళ్లు, కళాశాలలో జరుగుతున్న ఫీజుల దోపిడీ, పాఠ్యపుస్తకాల అమ్మకాలు, డీఈఓ, ఆర్ఐఓ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యంపై విద్యార్థి సంఘాల నేతలు ధ్వజమెత్తారు. గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యార్థి సంఘాల నాయకులు వేర్వేరుగా ఆందోళనలు చేశారు.

ఆర్ఐఓ కార్యాలయం వద్ద..: వామపక్ష విద్యా సంఘాలైన పీఎస్ఎఫ్ఐ, ఆర్ఎస్‌వైఎఫ్, ఏఐఎస్ఏ, పీఎస్‌యూ నాయకులు ఆర్ఐఓ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. పీఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రతిభా భారతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ ఆలం, ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు నరసింహ, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర ధర్నా చేశారు.

డీఈఓ కార్యాలయం వద్ద..: ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ఇతర నాయకులు డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. డీఈఓ వరలక్ష్మికి వినతి పత్రం ఇచ్చారు. అపార్టుమెంట్లు, నిర్మాణంలో ఉన్న స్కూళ్లకు అనుమతులు ఇచ్చారని, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఓబులేసు, ఇతర నాయకులు మంజునాథ్, హనుమంతు, ఉమామహేష్, వంశీ, హరికృష్ణ, హర్ష, సమీర్, రారాజు, హర్షద్, సాయి కార్తీక్ పాల్గొన్నారు.

ఏఐఎస్‌బీ, వీఎస్ఐవీ నేతల ధర్నా..: కక్కలపల్లి సమీపంలోని ఓ కార్పొరేట్ స్కూల్ వద్ద ఏఐఎస్‌బీ, వీఎస్ఐవీ విద్యార్థి సంఘాల నేతలు ధర్నా చేశారు. స్కూల్ పేరుతో ముద్రించిన పుస్తకాలు, యూనిఫామ్స్ అమ్ముతున్నారంటూ ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీ, వీఎస్ఐవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ ఆందోళన చేపట్టారు. ఎంఈఓ వెంకటస్వామి అక్కడికి చేసుకుని యూనిఫామ్స్, బుక్స్ అమ్మే గదిని సీజ్ చేశారు.





ఆర్ఐఓ కార్యాలయం వద్ద ఆందోళన.. డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలి

అనంతపురం క్రైం, జూన్ 13 : నగర పరిధిలోని మురుగు కాలువల్లో పూడికతీత పనులు క్రమం తప్పకుండా చేపట్టాలని నగర కమిషనర్ మేఘస్వరూప్ ఆదేశించారు. గురువారం కమిషనర్ నగరంలోని కమలానగర్, ఖాజానగర్, వేణుగోపాల్‌నగర్, సూర్యానగర్‌రోడ్డు, రాంనగర్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. సూర్యానగర్‌రోడ్డు, గౌరీ థియేటర్ వెనుకవైపు మరువ వంకలోని పూడికతీత పనులు పరిశీలించారు. తీసిన పూడికను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. 17వ సచివాలయ పరిధిలో తిలక్‌రోడ్డులో జరుగుతున్న చెత్త సేకరణ పనులను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలువల్లోనూ పూడిక తీయాలన్నారు. అన్ని ప్రాంతాల్లో దోమల నియంత్రణకు ఫాగింగ్, డ్రైను కాలువల్లో ఆయిల్‌బాల్స్, పిచికారీ చేయాలన్నారు. ఆయన వెంట ఎంహెచ్ఓ విష్ణుమూర్తి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ మేఘస్వరూప్ ఆదేశించారు. గురువారం కమిషనర్ తన ఛాంబర్లో వైద్యఆరోగ్య శాఖ మలేరియా విభాగం అధికారి ఓబులు, ఎంహెచ్ఓ విష్ణుమూర్తితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపరిధిలో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా సహాయ అధికారి సత్యనారాయణ, సబ్‌యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్లు నూరుబాషా, శ్రీధర్‌మూర్తి, మలేరియా అసిస్టెంట్ శంకరయ్య పాల్గొన్నారు.

పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలి

నగరంలోని పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలని నగర కమిషనర్ మేఘస్వరూప్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన సిద్దార్థ పార్కును పరిశీలించారు. పార్కులోని ఖాళీస్థలంలోని పిచ్చిమొక్కలు, రాళ్లు తొలగించాలని ఆదేశించారు. పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాల్సిన బాధ్యత నగరపాలికదేనని, పచ్చదనం పెంపొందించాలని హార్టికల్చర్ ఏడీ లక్ష్మీప్రసన్నకు ఆదేశించారు. ఆయన వెంట ఈఈ సూర్యనారాయణ, డీఈ సుభాష్ చంద్రబోస్ ఉన్నారు.

అనాథ విద్యార్థినికి రోటరీక్లబ్ అండ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 13: ఆత్మకూరు మండలం పాపంపల్లి గ్రామానికి చెందిన అలేఖ్య.. విద్యుత్తు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయింది. అనాథగా మారిన అలేఖ్యను తెలుగుదేశం పార్టీ అక్కున చేర్చుకుని విజయవాడలోని ఎన్టీఆర్ ట్రస్ట్ పాఠశాలలో చేర్పించింది. సొంత ఊరికి వచ్చిన అలేఖ్యకు రోటరీక్లబ్ చిల్డ్రన్స్ సర్వీస్ చైర్మన్ తైక్వాండో శాంతరాజ్ రూ.20 వేలు విలువ చేసే దుస్తులు, దుప్పట్లు, ఇతర నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు.



దుస్తులు, పరికరాలను అందజేస్తున్న శాంతరాజ్

అవసరమైన విత్తనకాయలను అందుబాటులో ఉంచండి

రామగిరి : ఉమ్మడి జిల్లాలో బాగా వర్షాలు కురుస్తున్నాయని, ఈ సందర్భంలో రైతులకు అవసరమైన విత్తనకాయలు అందించాలని సత్యసాయి, అనంతపురం జిల్లాల వ్యవసాయాధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. గురువారం ఆమె నసనకోటలో జరుగుతున్న వేరుశెనగ విత్తనకాయల పంపిణీని పరిశీలించారు. రైతులు ఎక్కువగా వేరుశెనగ, కందులు, ఆముదం విత్తనాలు అడుగుతున్నారని సిబ్బంది ఆమె దృష్టికితెచ్చారు. వెంటనే ఆమె రెండు జిల్లాల వ్యవసాయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు ఆముదం, చిరుధాన్యాలు విత్తనాలు కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. నాణ్యమైన విత్తనం ఇవ్వకుంటే వాటిని వెనక్కి ఇవ్వాలని ఆమె రైతులకు సూచించారు.

పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

అనంతపురం అర్బన్: వర్షాకాలాన్నీ దృష్టిలో ఉంచుకొని పశువులు, జీవాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. గురువారం స్థానిక పశుసంవర్ధక శాఖ అనంతపురం డీడీ కార్యాలయంలో అనంతపురం, రాప్తాడు, బుక్కరాయసముద్రం, గుత్తి, శింగనమల, ఏరియా ఆస్పత్రుల ఏడీలు, డాక్టర్లు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండలంలో గైనిక్ క్యాంపు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. షెడ్యూల్ మేరకు ప్రతి రోజు నిర్దేశించిన మండలంలో గైనిక్ క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. రెండు రోజుల్లో షెడ్యూల్ తయారు చేసి క్యాంపులు నిర్వహిస్తామన్నారు. తక్షణ వైద్య చికిత్సలు, శస్త్రచికిత్సలు, ఇతర వైద్యసేవలు అందించేందుకు ప్రతి మండలంలో నిష్ణాతులైన డాక్టర్లతో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. రైతుల నుంచి సమాచారం అందిన గంట వ్యవధిలోనే ర్యాపిడ్ బృందం డాక్టర్లు చేరుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భవిష్యత్‌లో గడ్డి కొరత లేకుండా ప్రతి రైతు పశుగ్రాసం పెంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంత డివిజన్ డీడీ శ్రీనివాసరావు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ సుధాకర్ పాల్గొన్నారు.

జగనన్న రీ సర్వే రాళ్ల తొలగింపు



రీ సర్వే రాయిని తొలగిస్తున్న గోపాల్‌గౌడ్

అనంతపురం అర్బన్, జూన్ 13 : రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు ఫైల్‌పై సంతకం చేసిన నేపథ్యంలో జగనన్న రీ సర్వే రాళ్లను టీడీపీ నాయకుడు గోపాల్ గౌడ్ తొలగించారు. గురువారం గార్లదిన్నె మండలం కనుంపల్లిలో జగనన్న రీ సర్వే రాళ్లను ఆయన తొలగించారు. చంద్రబాబు సీఎం హోదాలో తొలి సంతకం మెగా డీఎస్సీ, రెండోది ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు ఫైల్‌పై సంతకం పెట్టడం శుభపరిణామమన్నారు.

నిరుద్యోగుల జీవితాల్లో 'మెగా' వెలుగులు : దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జూన్ 13 : సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మెగా డీఎస్సీపై చంద్రబాబు తొలి సంతకం చేసి, నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా అంచనాలకు మించిన పోస్టులు ప్రకటించారన్నారు. ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు, సామాజిక పింఛన్లు రూ.4వేలకు పెంపు, అన్నా క్యాంటిన్ పునరుద్దరణ, నైపుణ్యాభివృద్ధిపై సంతకాలు చేయడంతో ఆయావర్గాలు ఆనందాన్ని వ్యక్తంచేస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందడంతోపాటు అన్ని వర్గాలకు న్యాయం జరగడం ఖాయమన్నారు.

గార్లదిన్నె ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

గార్లదిన్నె, జూన్ 13 : స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, సీపీఏ ఆశోక్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పెట్రోల్ బంక్ సమీపంలో ఇటీవల ఎంపీ నిధులతో వేసిన సీసీ రోడ్డును పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రాణాప్రతాప్, జగదీష్ ఉన్నారు.

మెగా డీఎస్సీపై ఎన్టీఏ హర్షం

అనంతపురం విద్య : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట మేరకు మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేయడం హర్షణీయమని నవ్యాంధ్రటీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో 50 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పార్లమెంట్ సాక్షిగా తేటతెల్లమైతే... గత ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను ఖాళీలు లేని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. గత ప్రభుత్వం టీచర్లపై పెట్టిన పని ఒత్తిడి కారణం టీచర్లు చాలా మంది చనిపోవడం బాధాకరమన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు తొలిసంతకంగా టీచర్ పోస్టుల నియామకాలపై చేయడంతో ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, యువతలో హర్షం వ్యక్తమవుతోందన్నారు.

ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుపై..: ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు ఫైల్‌పై సీఎం చంద్రబాబు సంతకం చేయడం హర్షణీయమని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మల్లికార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన భూయాజమాన్య హక్కుల చట్టాన్ని ప్రజాసంఘాల నాయకులు, రైతులు రద్దు చేయాలని అనేక రూపాల్లో ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు.

అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 13: వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగి, సంఘం నాయకుడు కేఆర్ సూర్యనారాయణ కోట్లాది రూపాయలు అక్రమాలకు పాల్పడ్డాడని, అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ది సిటీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాంతముని, కార్యదర్శి రాఘవేంద్ర ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రూ. కోట్లు అవినీతికి పాల్పడటంతో గత ప్రభుత్వం అతన్ని సస్పెండ్ చేసిందని, అతనికి సహకరించిన ఇతర ఉద్యోగులు, కార్యవర్గసభ్యులు జైలు పాలు అయ్యారని అన్నారు. ఆ సమయంలో అజ్ఞాతంలోకి వెళ్లిన సూర్యనారాయణ ప్రభుత్వానికి దొరక్కుండా రోజుకు రూ. కోటి ఫీజు చెల్లించి తనవరకూ మాత్రమే స్టే తెచ్చుకున్నారన్నారు. గతంలో నారా చంద్రబాబునాయుడును దుర్భాషలాడి వైసీపీ ప్రభుత్వానికి అంటకాగిన కేఆర్ సూర్యనారాయణ ... ప్రస్తుతం అధికారం మారడంతో చంద్రబాబునాయుడు చెంతకు చేరి అధికారులను బ్లాక్‌మెయిల్‌కు గురిచేస్తున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబునాయుడుతో ఫొటోలు దిగి... ఆయన తనకు అనుకూలంగా ఉన్నారని వాణిజ్యపన్నుల శాఖలోని ఉన్నతాధికారులపై ఫిర్యాదు చేశానని గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం కేఆర్ సూర్యనారాయణపై చర్యలు తీసుకోవాలని, ఆయన నిర్వహిస్తున్న సంఘం గుర్తింపు రద్దు చేయాలని కోరారు.

నేడు సీసీఎఫ్ రాక

అనంతపురం న్యూటౌన్, జూన్ 13: చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ నాగేశ్వరరావు శుక్రవారం జిల్లా కేంద్రానికి వస్తున్నారు. సిబ్బందితో సమావేశమై... శాఖాపరమైన అంశాలపై చర్చించే అవకాశముంది. దీంతోపాటు ఎస్ఎఫ్ఓ నుంచి డీఆర్వోకు అర్హత ఉన్న వారికి పదోన్నతులు కూడా కల్పించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీంతో సోషియల్ ఫారెస్ట్‌లో ఎస్ఎఫ్ఓగా ఉన్న దీపాకు పదోన్నతి లభించే అవకాశం ఉంది. అనంతరం ఎఫ్‌బీఓల నుంచి ఖాళీగా ఉన్న ఎస్ఎఫ్ఓ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

బాల్య వివాహాలను పూర్తిగా నియంత్రించాలి

అనంతపురం టౌన్, జూన్ 13: జిల్లాలో ఎక్కడా బాల్యవివాహాలు జరగకుండా పగడ్బందీగా చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్, బాల్యవివాహాలు తదితర అంశాలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పిల్లలకు సంబంధించిన చట్టాలను పక్కాగా అమలు చేయాలన్నారు. బాల్యవివాహాలు ఎక్కువ జరిగే బొమ్మనహాల్, డీ.హీరేహాల్, పెద్దపప్పూరు, యల్లనూరు మండలాలల్లో అధికారుల బృందాలు పర్యటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాయదుర్గంరూరల్, జూన్ 13: పట్టణంలోని సత్యనారాయణస్వామి దేవాలయంలో వరలక్ష్మి, సత్యనారాయణస్వామి కల్యాణం గురువారం నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి నదిజలాలతో అభిషేకం, విశ్వక్షేన ఆరాధన, పుణ్యాహవాచనం, పసుపు చందనాలతో అభిషేకం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉదయం 10.30 గంటల నుండి 12.30 గంటల వరకు స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి 8 గంటలకు స్వామివారి శయనోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

చంద్రబాబు తొలి సంతకంపై హర్షం



చంద్రబాబునాయుడు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 13: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఇచ్చిన మాట ప్రకారం తొలి సంతకం మెగా డీఎస్సీపై చేసినందుకు నిరుద్యోగుల ఏపీ రాష్ట్ర జేఏసీ కో కన్వీనర్ పవన్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కార్యాలయంలో నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తానని అధికారంలోకి వచ్చిన వెంటనే కనీసం ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగులు, స్టూడెంట్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠా అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం, జూన్ 13: నియోజకవర్గంలో వ్యవసాయ క్షేత్రాల్లో అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగి వైరును చోరీ చేసే ముఠా సభ్యులను పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. ఇటీవల కంబదూరు మండలం వెంకటాంపల్లి, కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లి గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని వైర్లను చోరీ చేశారు. దీనిపై కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు చొరవ తీసుకుని సీఐ, ఎస్ఐలను విచారణకు ఆదేశించారు. నిఘా ఉంచిన పోలీసులు గురువారం నిందితులను పట్టుకుని వారి నుంచి రాగి వైరును స్వాధీనం చేసుకున్నారు. కంబదూరు మండలం నూతిమడుగుకు చెందిన చాకలి రాఘవేంద్ర, కావలి యర్రిస్వామిని అరెస్టు చేసి పది ట్రాన్స్‌ఫార్మర్ల రాగి వైరును స్వాధీనం చేసుకున్నారు. సుమారు 150 కిలోల వైరు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ముఠా సభ్యులను పట్టుకోవడానికి కళ్యాణదుర్గం రూరల్ సీఐ చంద్ర శేఖర్, కంబదూరు ఎస్ఐ ఆంజనేయులు చూపించిన చొరవ ప్రశంసనీయమని డీఎస్పీ అన్నారు.

కాపులను గుర్తించడంపై సంబరాలు



పవన్ కల్యాణ్ ఫ్లెక్సీ వద్ద బలిజ సంఘం నాయకుల సంబరాలు

రాయదుర్గంరూరల్, జూన్ 13: తెలుగుదేశం పార్టీ కాపులను గుర్తించి జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు సముచిత స్థానం కేటాయించడంతో రాయల్ యువసేన ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. గురువారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో రామాంజనేయులు, కార్యదర్శి యువజన అధ్యక్షుడు వెంకటస్వామినాయుడు, అర్జున్, గాజుల వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

పెద్దపప్పూరు, జూన్13: మండలంలోని నరసాపురం గ్రామ సమీపంలో గురువారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. గ్రామ సమీపంలోని పెన్నా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడిచేసి టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు: సీఐ

పుట్లూరు, జూన్13: గ్రామంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండలంలోని చాలవేముల గ్రామంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణం ఉండేలా ఇరువర్గాలు సహకరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది ఉన్నారు.

ఎడతెరిపిలేని వాన



కణేకల్లులో కురుస్తున్న వర్షం

కణేకల్లు, జూన్ 13: మండల వ్యాప్తంగా గత నాలుగురోజుల నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో ఎక్కడికక్కడి వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ప్రతిరోజూ కొద్దిసేపు ఎండకాయడం, ఆ తర్వాత వర్షం కురవడం సాధారణంగా మారిపోయింది. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి వరకు వర్షం కురిసింది. వర్షం తగ్గితే ఖరీఫ్ సేద్యం ప్రారంభించేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

బ్యాంక్ అకౌంట్లు హోల్డ్‌లో పెట్టారని రైతుల ధర్నా



ప్రధాన రహదారిపై బైఠాయించిన కమలపాడు రైతులు

యాడికి, జూన్13: తమ బ్యాంక్ అకౌంట్లు హోల్డ్‌లో పెట్టారని కమలపాడు గ్రామానికి చెందిన రైతులు గురువారం యాడికిలోని కెనరాబ్యాంక్ ఎదుట ధర్నాకు దిగారు. కమలపాడు గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి, రాంమోహన్‌లు 13ఏళ్ల కిందట అదే గ్రామానికి చెందిన చెన్నారెడ్డి రుణానికి జామీను పడ్డారు. చెన్నారెడ్డి గతంలోనే చనిపోయాడు. అతడి వారసులు రుణాన్ని చెల్లించలేదు. బ్యాంక్ అధికారుల నోటీసులకు కూడా స్పందన లేకపోవడంతో జామీను ఉన్న శంకర్‌రెడ్డి, రాంమోహన్‌ల బ్యాంక్ అకౌంట్లను బ్యాంక్ అధికారులు హోల్డ్‌లో పెట్టారు. తమ అకౌంట్‌లను హోల్డ్‌లో నుంచి తీసివేయాలని బ్యాంక్ అధికారుల చుట్టూ బాధితులు తిరిగారు. జామీనుపడ్డ రుణం చెల్లిస్తే హోల్డ్‌లో నుంచి తీసివేస్తాం అని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంక్ అధికారుల తీరును నిరసిస్తూ శంకర్‌రెడ్డి, రాంమోహన్‌లతోపాటు మరికొందరు రైతులు ధర్నాకు దిగారు. ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు ధర్నాకు దిగిన వారివద్దకు వచ్చి సర్దిచెప్పారు. బ్యాంక్ లోపలకు పిలుచుకొనివెళ్లి బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడారు. బ్యాంక్ నిబంధనల మేరకు జామీనుపడ్డ వారికి నోటీసులు ఇచ్చామని, స్పందన లేకపోవడంతో వారి అకౌంట్‌లు హోల్డ్‌లో పెట్టామని తెలిపారు. పంట సాగుకాలంలో తమ అకౌంట్‌లు హోల్డ్‌లో పెడితే తాము తీవ్ర ఇబ్బందులు పడతామని రైతులు తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకుండా అకౌంట్‌లు హోల్డ్‌లో నుంచి తీసివేయాలని బ్యాంక్ అధికారులకు పోలీసులు తెలిపారు. ఎట్టకేలకు పోలీసుల జోక్యంతో సమస్య సద్దుమణిగింది.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం: టీడీపీ



టీఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరించిన గుమ్మనూరు నారాయణస్వామి

గుంతకల్లు, జూన్13: టీడీపీ అనుబంధ సంస్థ అయిన టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి పేర్కొన్నారు. గురువారం ఉదయం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ఏర్పాటుచేసిన టీఎన్‌టీయూసీ శాశ్వత పతాక స్తంభాన్ని ప్రారంభించి, జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, అంజి, గుడిపాటి ఆంజనేయులు, న్యాయవాది హేమాద్రి, యూ ప్రభాకర్, వై సుధాకర్, అహ్మద్ బాషా, గుజిరీ మహమ్మద్ ఖాజా, ఫ్రూట్ మస్తాన్, ఫజులు, యూసుఫ్ ఖాన్, షర్ఫుద్దీన్, శివన్న, బండారు నగేశ్, జిలాన్ బాషా పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై దృష్టి సారించండి

పట్టణంలోని వార్డుల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టిని పెట్టాలని మున్సిపల్ కమిషనరు వెంకట రమణయ్యను టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి కోరారు. గురువారం ఉదయం మున్సిపల్ కమిషనరును కలిసిన ఆయన పట్టణ సమస్యలపై చర్చించారు. త్వరలో వార్డుల్లో పర్యటించి సమస్యలను రికార్డు చెయ్యాలని సూచించారు. ఆ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే జయరాంతో చర్చించి చర్యలు తీసుకుందామని తెలియజేశారు.

హింసకు పాల్పడితే కఠిన చర్యలు: డీఎస్పీ

కళ్యాణదుర్గం, జూన్ 13: హింసాత్మక ఘటనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని ఒంటిమిద్దె గ్రామంలో గురువారం కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారి కాలనీలలో కవాతు కొనసాగింది. అనంతరం గ్రామస్థులతో డీఎస్పీ మాట్లాడారు. అల్లర్లు, గొడవల జోలికెళ్లి కేసుల్లో ఇరుక్కుపోవద్దని సూచించారు. ముఖ్యంగా యువత సంయమనంతో ఉండాలని కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ హరినాథ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

బొమ్మనహాళ్, జూన్ 13: మండలంలోని నేమకల్లు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన కర్మాగారాలు రైతులకు పరిహారం ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని సీపీఐ నాయకులు సర్మాస్, గౌస్, తిప్పేస్వామి, కొట్రేష్ ఆరోపించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద గురువారం వారు ఆందోళన చేశారు. డీ.హీరేహాళ్, నేమకల్లు పరిధిలో ఉన్న కర్మాగారాల నుండి పంట పొలాలకు నష్టం జరుగుతోందన్నారు. ఫ్యాక్టరీల యజమానులు అరకొర పరిహారం అందించి రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఎకరాకు రూ. 15 వేల నుంచి రూ. 30 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి, నరసింహులు, రఫీ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంతకల్లుటౌన్,జూన్13: గుంతకల్లు పట్టణం, మండలం, వజ్రకరూరు మండల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ డీఈఈ రంగస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 220కేవీ గుత్తి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని ఆయన తెలిపారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

గుత్తిరూరల్, జూన్ 13: మండలంలోని శ్రీపురం, రజాపురం గ్రామాల సమీపంలోని 63 వ జాతీయ రహదారిపై గురువారం రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. వారం రోజులుగా వర్షం కురుస్తుండడంతో రోడ్డు అంత గుంతల మయమైంది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టుల వద్ద గుంతలు పడడంతో ద్విచక్ర వాహనదారులు కిందపడి ప్రమాదలకు గురైవుతున్నారు. విషయం తెలుసుకొని గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం సోదరుడు నారాయణ తన సొంత నిధులతో గుంతలకు ఎర్రమట్టిని తోలి ఈటాక్స్ ద్వారా రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఉరవకొండ, జూన్13: సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో మలేరియా మాసోత్సవాలలో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.

కుందుర్పి: మండల కేంద్రంలోని హాస్టళ్లలో గురువారం వైద్య సిబ్బంది దోమల నివారణకు మలాథిన్ స్ప్రే చేయించారు. గ్రామంలోని నీటి గుంటలలో వేస్ట్ ఆయిల్ బాల్స్ వేశారు. దోమ కాటు వలన జరిగే అనర్థాలను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తాలుకా మలేరియా అధికారిపై తిరుపాలయ్య, వైద్యాధికారి డాక్టర్ చాంద్ బేగమ్, పంచాయతీ కార్యదర్శి బాషా, ధరమ్‌సింగ్, శశికళ, రాణి మంజుల పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీడీపీ సంబరాలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

తాడిపత్రిటౌన్, జూన్13: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం, తాడిపత్రి ఎమ్మెల్యేగా జేసీ అస్మిత్‌రెడ్డి అఖండ విజయం సాధించడంతో టీడీపీ కౌన్సిలర్లు గురువారం సంబరాలను కొనసాగించారు. అనంతపురంలోని జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసంలో టీడీపీ కౌన్సిలర్లు కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డితోపాటు వైస్‌చైర్మన్ సరస్వతి, కౌన్సిలర్లు రేష్మాపర్వీన్, జింకా లక్ష్మీదేవి, అరుణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా

పెద్దవడుగూరు, జూన్13: మండలంలోని మేడిమాకులపల్లి, తెలికి, ఏ. తిమ్మాపురం గ్రామాల్లో ఉపాధిహామి పథకంలో పనిచేస్తున్న ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లు స్వచ్ఛందంగా గురువారం రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. వారి రాజీనామాలను ఆమోదించామని ఆయన తెలిపారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలను అందిస్తున్న ఎంఈఓ రామచంద్రప్ప(గుమ్మఘట్ట)

గుమ్మఘట్ట, జూన్ 13: మండలంలోని ఎంజేబీ గురుకుల విద్యాలయం ఇతర ప్రాథమిక పాఠశాలలకు గురువారం ఎంఈఓ రామచంద్రప్ప పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల పునః ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు అవసరమయ్యే పాఠ్యపుస్తకాలు ఉపాధ్యాయులు తీసుకెళ్లి విద్యార్థులకు పంపిణీ చేయాలని ఎంఈఓ సూచించారు. సీఆర్పీలు శివశంకర్, నారాయణరెడ్డి, తమ్మేష్ పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలను అందించినట్లు గురువారం ఎంఈఓ శ్రీదేవి తెలిపారు. మొత్తం 46పాఠశాలల్లో 2481మంది విద్యార్థులకు 5613 పుస్తకాలు వచ్చాయన్నారు. 14882 నోటుపుస్తకాలు కూడా వచ్చాయనీ, విద్యార్థులకు త్వరలో అందిస్తామని ఎంఈఓ తెలిపారు.

ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు

యాడికి: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలను అందజేస్తామని ఎంఈఓ కాశప్ప, ఎంఈఓ-2 ధనలక్ష్మి తెలిపారు. గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాల పంపిణీని ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు మండలానికి 25వేల పాఠ్య పుస్తకాలు, 21150 నోటు పుస్తకాలు, 2400 బెల్టులు, 3450 జతల బూట్లు వచ్చాయని తెలిపారు. ఇంకా కొన్ని పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. పాఠశాల ప్రారంభంరోజునే విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు శైలజ, బాబు, ఓబులేసు, ఎంఐఎస్ విశ్వనాథ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి తోడ్పాటు: పీజేఆర్



గార్మెంట్స్‌లో వస్త్రాలను కుడుతున్న మహిళలు

పామిడి, జూన్ 13: మహిళల స్వయం ఉపాధికి తోడ్పడతామని పీజేఆర్ సోషల్ సర్వీస్ ట్రస్టు చైర్మన్, టీడీపీ నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గజరాంపల్లి గ్రామ సమీపంలోని వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్‌లో గురువారం అంతర్జాతీయ కుట్టు మిషన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్ అధినేత్రి పెరుమాళ్ల మమతారెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థిక ఎదుగుదలకు వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్ కృషి చేస్తుందన్నారు. ఎంతో మంది మహిళలకు కుట్టుపై ఉచితంగా శిక్షణ కల్పించి వారికి ప్రోత్సాహక వేతనాలు సైతం అందజేస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మరింత మంది మహిళలకు స్వయం ఉపాధి కల్పనకు తోడ్పాటునందిస్తామన్నారు. గార్మెంట్ పరిశ్రమలో రెండు వేల మందికి ఉపాధి కల్పిస్తున్నామని ప్రస్తుతం 350మంది పనిచేస్తున్నారన్నారు. పరిశ్రమలో ఉద్యోగావకాశం కోసం 604237701, 9888539999 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం: ఎస్పీ



డీఎస్పీతో మాట్లాడుతున్న ఎస్పీ

తాడిపత్రి టౌన్, జూన్13: శాంతిభద్రతల పరిరక్షణే తమ లక్ష్యమని జిల్లా ఎస్పీ గౌతమిశాలి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్నికల ఫలితాల అనంతరం పట్టణంలో శాంతిభద్రతలపై సిబ్బందిని ఆరాతీశారు. గస్తీని మరింత పెంచి ఎక్కడ ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మధ్యకాలంలో పట్టణంలో వరుసగా జరుగుతున్న దొంగతనాలపై ఎస్పీ సీరియస్ అయినట్లు సమాచారం. ఆమె వెంట డీఎస్పీ జనార్దన్‌నాయుడు, సీఐలు నాగేంద్రప్రసాద్, లక్ష్మీకాంత్‌రెడ్డి ఉన్నారు.

శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు

ఉరవకొండ: గ్రామాల్లో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ గౌతమి శాలి పేర్కొన్నారు. పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో గుంతకల్లు డీఎస్పీ, సీఐ, ఎస్ఐలతో గురువారం సమావేశం నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక గ్రామాలు, కాలనీలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ రాఘవేంద్రప్ప పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పునర్నిర్మాణానికి ఏర్పాట్లు



కళ్యాణదుర్గంలో అర్ధంతరంగా ఆగిపోయిన అన్న క్యాంటీన్ భవనం

కళ్యాణదుర్గం, జూన్ 13: టీడీపీ అధికారంలోకి రావడంతో పట్టణంలో గతంలో ఆగిపోయిన అన్న క్యాంటీన్ పునర్నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ దగ్గర ఉన్న అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది గురువారం పరిశీలించారు. భవన స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ భవనం మరమ్మతులు ఏ స్థాయిలో చేయాలో? ఎప్పుడు పూర్తి చేయాలో అన్న వాటన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆకలితీర్చే అన్న క్యాంటీన్ పునర్నిర్మాణానికి పూనుకోవడంతో పలువురు నిరుపేదలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

గుంతకల్లుటౌన్, జూన్ 13: పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గురువారం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. బజరంగ్‌దళ్ సాప్తహిక్ రాష్ట్ర కన్వీనర్ కసాపురం రవి మాట్లాడుతూ భారత దేశ ప్రధాన మంత్రిగా మోదీ మూడవ సారి ప్రమాణ స్వీకారం చేయడాన్ని జీర్ణించుకోలేని ఉగ్రవాదులు జమ్మూకాశ్మీర్‌లో వైష్ణోదేవి అమ్మవారిని దర్శించుకుని బస్సులో వెళ్తున్న భక్తులపై కాల్పులు జరిపారన్నారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ పట్టణ కన్వీనర్ వలిపి ప్రభాకర్, పట్టణ సేవా ప్రముఖ్ బండిమురళి, సహసేవ ప్రములు నారాయణరెడ్డి, నెట్టికంటి, మోహన్‌నాయుడు, విశ్వనాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల కాపరిపై ఎలుగుబంటి దాడి

రాయదుర్గంరూరల్, జూన్ 13: మండలంలోని చదం గొల్లలదొడ్డి గ్రామంలో పశువుల కాపరిపై ఓ ఎలుగుబంటి గురువారం దాడి చేసింది. గ్రామానికి చెందిన కాపరి జడప్ప గ్రామ సమీపంలోని గట్టిమల్లప్ప కొండ వద్ద పశువులను మేపుతుండగా ఎలుగుబంటి దాడి చేసింది. స్వల్పంగా గాయపడిన అతడిని స్థానికులు గమనించి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎలుగుబంటి దాడులు నుండి ప్రజలను కాపాడాలని అటవీ అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీపై వివాదం

యాడికి, జూన్13: యాడికి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన ఏజెన్సీపై గురువారం వివాదం నెలకొంది. ఇక్కడ ఇదివరకు వైసీపీ వర్గీయులు మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. అధికారం మారడంతో ఏజెన్సీ నిర్వహణను తామే చూసుకుంటామని టీడీపీ నాయకులు పట్టుబట్టారు. గురువారం పాఠశాల ప్రారంభం కావడంతో వంట చేయడానికి వైసీపీ వర్గీయులు వచ్చారు. అదే సమయంలో టీడీపీ వర్గీయులు పాఠశాల వద్దకు రావడంతో వివాదం రేగింది. వంట మేము చేస్తాం అంటే కాదు మేము చేస్తాం అంటూ ఇరువర్గీయులు వాగ్వాదం చేసుకున్నారు. ఎంఈఓ కాశప్ప, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు నాగన్న ఇరువర్గాల వారికి సర్దిచెప్పారు. ఎట్టకేలకు టీడీపీ వర్గీయులు గురువారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి వడ్డించారు. దీంతో ఏజెన్సీ వివాదం సద్దుమణిగింది.

చెరువులకు చేరుతున్న నీరు



వర్షపు నీటితో బ్రాహ్మణపల్లి చెరువు

బెళుగుప్ప, జూన్ 13: మండలంలో బుధవారం రాత్రి 40.2 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. రోజు వర్షం కురుస్తుండటంతో మండలంలోని చెరువులకు 40 శాతానికి పైగా వర్షపు నీరు చేరింది. బ్రాహ్మణపల్లి చెరువుకు భారీగా నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు సంతోషకరం

- టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి



గుంతకల్లు, జూన్13: ప్రమాదకరమైన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దుచేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన రెండో సంతకం చేయడం సంతోషకరమని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై న్యాయవాదులు ఉద్యమించి పోరాడారని తెలిపారు. ప్రజలకు ఎంతో నష్టదాయకమైన ఈ చట్టాన్ని రద్దుచేయాలని చంద్రబాబు నాయుడు ఉద్యమాన్ని నడిపారని, ముఖ్యమంత్రి అయిన వెంటనే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దుపరచడం స్వాగతించదగిందన్నారు.